క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఉపాధ్యాయులతో ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు పీఈటీ ఉపాధ్యాయుడు రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేఒర్కన్నారు. అండర్–19 జట్టుకు నందిని, అండర్–16 జట్టుకు కౌశిక్‌రెడ్డి, హర్షిత ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో నెల్లూరు, చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అనంతపురం జిల్లా జట్టు నుంచి ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. విద్యార్థుల ఎంపికపై ప్రాధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా?



చెత్తాచెదారాన్ని చూపుతున్న సివిల్ జడ్జి రాజేష్

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రాకేష్ శానిటరీ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, కుళ్లిన పేపర్లు ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్‌ను పిలిపించారు. కార్యాలయాల చుట్టూ ఉన్న చెత్తా చెదారాన్ని చూపించి ఇలాగేనా పారిశుధ్య పనులు చేయించేది అంటూ మండిపడ్డారు. ఇది వరకే పలు మార్లు కోర్టు కానిస్టేబుళ్లతో చెప్పి పంపినా పట్టించుకోలేదన్నారు. మరోసారి ఇలా జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి శనివారం కోర్టు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుధ్య పనులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులు, రాజేంద్ర ప్రసాదరెడ్డి, యదుభూషణ, శేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న మెకానిక్ షావలి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గిర్రాజు కాలనీ క్రాస్ వద్ద సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని గిర్రాజు కాలనీకి చెందిన మెకానిక్ షావలి ద్విచక్ర వాహనంలో పోతుకుంట బీసీ కాలనీ నుంచి తన ఇంటికి బయలుదేరాడు. పట్టణంలో నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనాన్ని గిర్రాజు కాలనీ క్రాస్ వద్ద షావలి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో షావలి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నేకొత్తపల్లి వైస్ ఎంపీపీ-2 గా జ్యోతి



వైస్ ఎంపీపీ- 2గా ఎంపికైన జ్యోతికి డిక్లరేషన్ ఫాం అందిస్తున్న అధికారులు, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు–2గా పల్లెన్నగారి జ్యోతి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గంగావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతితో ప్రొసీడింగ్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యాడు. నూతనంగా ఎన్నికైన వైస్ ఎంపీపీ –2ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, నాయకులు గాలిశ్రీనివాస రెడ్డి, ఎస్‌టీడీ శ్రీనివాసరెడ్డి, సింగం హనుమంత రెడ్డి, సర్పంచ్ ధనశ్రీ సింగిల్ విండో అధ్యక్షుడు దోలు రామచంద్రా రెడ్డి ,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అక్షర సేవకులు

అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదిస్తారు ఉపాధ్యాయులు. సమాజంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం వారిదే. విద్యార్థి తప్పు చేస్తే దండించిన చేతులతోనే మళ్లీ అక్కున చేర్చుకుంటారు. తమకున్న జ్ఞానాన్ని ధారపోసి, కొవ్వొత్తుల్లా కరిగిపోతారు. తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుంటే మురిసిపోతారు. విద్యా బోధన, సామాజిక సేవలో ముందు వరుసలో ఉన్న పలువురు ఉపాధ్యాయులపై జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం మీకోసం..

- విద్యా బోధన, సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు
- నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

విద్యార్థులకు ఉచిత శిక్షణ



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఉపాధ్యాయుడి పేరు బీపీ. తిమ్మప్ప. బత్తలపల్లి మండలంలోని జలాలపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. తన సొంత ఖర్చులతో ట్యూటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ట్యూటర్‌కు నెలకు రూ.1,000 చొప్పున ఇస్తున్నాడు. 1993లో ఎస్కేయూలో ఎంఏ పొలిటికల్ సైన్సులో అప్పటి గవర్నర్ కృష్ణకాంత్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. 1993 నుంచి 2002 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పని చేస్తూ పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇచ్చారు. 2002లో ఉద్యోగంలో చేరారు. 2016లో ఉరవకొండ ఎమ్మార్వో ఉమామహేశ్వర్‌రెడ్డి నిర్వహించిన గ్రూప్ ఎగ్జామ్స్ శిక్షణ శిబిరంలో కోచింగ్ ఇచ్చారు. అలాగే పాఠశాల విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రి అందజేసి, అండగా ఉంటున్నారు. – బత్తలపల్లి:

బోధనలో దిట్ట.. సురేష్ బాబు



ఈ ఫొటోలో కనిపిస్తున్న ప్రధానోపాధ్యాయుడి పేరు కె.సురేష్ బాబు. గాండ్లపెంట మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వరిస్తున్నారు. ఈయన 2015లో ఇక్కడ విధుల్లో చేరినప్పుడు పాఠశాలలో 42 మంది విద్యార్థులు ఉండేవారు. విద్యార్థుల నిష్పత్తి పెంచేందుకు విశేషంగా కృషి చేశారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి, విద్యార్థులను బడికి పంపాలని సూచించేవారు. ఈయన చొరవతో ప్రస్తుతం ఈ పాఠశాలలో165 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 2016 ఏడాదిలో తన సొంత నిధులతో విద్యాకిట్ ఏర్పాటు చేశారు. దాతల ద్వారా విద్యార్థులకు బూట్లు, టై, నోట్‌బుక్స్ అందించి విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఆంగ్ల విద్యాబోధనకు ల్యాబ్ ఏర్పాటు చేయించారు. టీవీ ద్వారా ఆంగ్ల పాఠాలు నేర్పించేలా చర్యలు తీసుకున్నారు. యోగా, ధ్యానం, దేశనాయకుల జయంతి, పాఠశాల వార్షికోత్సవాలు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టి అందరితో శభాష్ అనిపించుకన్నారు. – గాండ్లపెంట

సహాయం చేసి.. ఆదర్శంగా నిలిచి



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి (ఫైల్)



పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీకాంత్ (ఫైల్)

బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, కేశాపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, విదేశీయుల సహకారంతో సిద్దరాంపురం పాఠశాలను హెచ్‌ఎం శ్రీకాంత్ అంత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి.. తాను చదువున్న సిద్దరాంపురం ఉన్నత పాఠశాల అభివృద్ధికి విదేశీయుల అందించిన సుమారు రూ.15 లక్షలతో పాఠశాలలో డైనింగ్ హాల్, తరగతి గదులకు టైల్స్ వేయించారు. చెర్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విదేశీయుల సహకారంతో రూ.12 లక్షలతో వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లు, విద్యార్థుల కోసం ఆట స్థలం ఏర్పాటు చేయించారు. కోవిడ్ సమయంలో పలు గ్రామాల్లో ఉచితంగా నిత్యవసరాలు అందించారు. – పుట్టపర్తి:

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

నల్లమాడ: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా బుక్కపట్నానికి చెందిన నాగరాజు, గోపి ఎంపికయ్యారు. నాగరాజు బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నారు. గోపి కొత్తచెరువు మండలం వంగంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. నల్లమాడ మండలంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయినులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికయ్యారు. వీరిలో కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ వై.రమాదేవి, హిందీ సీఆర్‌టీ ఎస్. షమీల, పెమనకుంటపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న బి.అనిత ఉన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి గతంలో రామగిరి, కనగానపల్లి కస్తూరిబా పాఠశాలల్లో హిందీ సీఆర్‌టీగా పని చేశారు. ఏటా వందల సంఖ్యలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రాథమిక, మాధ్యమిక పరీక్షలు రాయించారు. ఇటీవలే బదిలీపై నల్లమాడ కస్తూరిబా పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు.



అనిత, ఎస్జీటీ, ఎంపీపీఎస్, పీకేపీ తండా



షమీల సీఆర్‌టీ, హిందీ, కేజీబీవీ నల్లమాడ



రమాదేవి, ప్రిన్సిపాల్, కేజీబీవీ నల్లమాడ



మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సన్మానం పొందుతున్న అనిత

'ఆదర్శ' శిక్షకుడు.. మాధవరాజులు



పీడీ మాధవరాజులు

కనగానపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులను మెరుగులు దిద్దుతూ వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయిస్తూ పలువురు చేత ప్రశంసలు అందుకుంటున్నారు పీడీ మాధవరాజులు. కనగానపల్లి మోడల్ స్కూల్‌లో కాంట్రాక్టు వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఈయన పదేళ్లుగా పనిచేస్తున్నాడు. పాఠశాలలోని విద్యార్థులకు క్రీడల్లో మెరుగైన శిక్షణ అందిస్తున్నాడు. దీంతో గత నాలుగైదేళ్లుగా పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు కబడ్డీ, ఖోఖో పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఈ సంవత్సరం (2023–24 విద్యా సంవత్సరం) లో కనగానపల్లి మోడల్ స్కూల్ జిల్లా స్థాయిలో ఉత్తమ క్రీడా పాఠశాలగా ఎంపిక చేశారు. గత స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా పీడీ మాధవరాజులు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంలో జిల్లా స్థాయి అధికారులు, పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.



అధికారుల నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న పీడీ మాధవరాజులు

పారదర్శకంగా పింఛన్ల మంజూరు

- జగనన్నను ఆశీర్వదించండి
- హామీలన్నీ అమలు చేస్తున్నారు
- ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి



తలుపుల: వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం కుల మతాలకు అతీతంగా ఏ ఒక్కరి సిఫార్సులు లేకుండా అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో ఎంపీపీ రఫీనాయక్, ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు అధ్యక్షతన ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలానికి కొత్తగా మంజూరైన 383 పింఛన్లను ఎమ్మెల్యే సిద్దారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షమానికి పాటుపడుతున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. గత టీడీపీ హయాంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కేవలం టీడీపీ సానుభూతిపరులకే పింఛన్లు మంజూరైనట్లు గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా నేరుగా పింఛన్లు అందజేస్తున్నారన్నారు. ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో మండల కేంద్రంలో ఆఫీసుల వద్ద పడిగాపుల కాయాల్సిన పరిస్థితి నుంచి నేరుగా మీ ఇంటి వద్దకే పింఛన్ అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తలుపుల మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 30 నుంచి 40 వరకూ గ్రామాల్లో రోడ్లు వేసినట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడానికి ప్రభుత్వ హాస్పిటల్ భవనం నిర్మించామన్నారు. ఇంకా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో 13 సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు, హెల్త్ సెంటర్లు, నాడు–నేడు కింద పాఠశాలలను కార్పొరేట్‌ను తలదన్నేలా నిర్మించామని వెల్లడించారు. గత టీడీపీ హయాంలో మండలంలో అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మాజీ సర్పంచులు సూర్యనారాయణ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కుర్లి శివా రెడ్డి, ఫయాజ్ అహమ్మద్, నరసింహా రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, మండల జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, సర్పంచులు షేక్షావలి, వెంకటనారాయణ, దివాన్‌వలి, పెద్దినాయుడు, దేవేంద్ర నాయక్, రాజగోపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లోకనాథరెడ్డి, రఘురాములు పాల్గొన్నారు.

వేడుకగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

తలుపుల: మండలంలోని గంజివారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం వైభవంగా జరిగింది. గత రెండు రోజులుగా గ్రామస్తులంతా శాస్త్రోత్తంగా పూజలు చేపట్టారు. సోమవారం భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని ప్రతిష్టించారు. భక్తులకు ఈడిగ సంఘం గౌడ్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీనరసింహ స్వామి టెంపుల్ చైర్మన్ గోపాలకృష్ణ, ఆవుల వెంకట నారాయణరెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి పాల్గొని పూజలు చేయించారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ట

గాండ్లపెంట: మండల పరిధిలోని మునగలవారిపల్లిలో నూతనంగా నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూలమాల వేసి సన్మానించారు. స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహా గౌడ్, మాజీ సర్పంచ్ హుస్సేన్‌పీరా, ప్రతాపరెడ్డి, రాజారెడ్డి, గ్రామస్తులు చిన్నపరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే అర్హత టీడీపీకి లేదు

- వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: రాప్తాడు నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని విమర్శించే అర్హత పరిటాల సునీత, టీడీపీ నాయకులకులేదని వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన వైస్ ఎంపీపీ–2 ఎన్నికకు ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అధికారంలో లేనినాడే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పేదలకు సొంత నిధులతో బోర్లు వేయించారని, గొర్రెల పంపిణీ చేసి, బడుగుబలహీన వర్గాల వారికి అండగా నిలిచారన్నారు. 25 ఏళ్లుగా పరిటాల కుటుంబ సభ్యులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అరాచకాలు సాగించారన్నారు. అధికారంలో ఉన్నా వారు ప్రజలకు చేసిందేమీలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో బోరు ఏర్పాటు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాలతో సోమవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షంషాద్‌బేగం, వార్డు ఇన్‌చార్జ్ చాంద్ బాషా తదితరులు బోరు వేయించారు. కాలనీలో ప్రజల సౌకర్యార్థం బోరు వేయించామని వార్డు ఇన్‌చార్జ్ చాంద్‌బాషా తెలిపారు.

ఘనంగా రత్నాకర్ జన్మదిన వేడుకలు



రత్నాకర్‌కు పూలమాల వేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు, తదితరులు

పుట్టపర్తి టౌన్: సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్ జన్మదిన వేడుకలను పుట్టపర్తి పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆర్.జే రత్నాకర్ భారీ కటౌట్ ఏర్పాటు చేసి ఆయన్ను గజమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తంగా ఓబుళపతి, వైస్ చైర్మెన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, డాక్టర్ గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు సూర్యనారాయణ, ఏపీసీ మెంబర్ కోటా సత్యనారాయణ, బీజేపీ నాయకులు కొండమరాజు, కత్తిరాజారెడ్డి, ఎమ్మార్పీస్ నాయకులు, ఆర్‌వీజే ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పాసుల అందజేత

ధర్మవరం అర్బన్: పేద విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను అందించడం సంతోషంగా ఉందని 24వ వార్డు కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తం రెడ్డి తెలిపారు. పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 90 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో బస్సు పాసులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు వేణు, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు కేబీ నాగార్జునరెడ్డి, వైవీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో తెలుగు లెక్చరర్ మృతి

బత్తలపల్లి: శ్రీకోటి సాయిలిపి డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్న ఆకుల రంగనాయకులు (49) బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. తాడిమర్రి మండలం పిన్నదరి గ్రామానికి చెందిన రంగనాయకులు బత్తలపల్లి, ధర్మవరంలోని ప్రవేట్ కళాశాలల్లో గత ఐదు సంవత్సరాలుగా తెలుగు లెక్చరర్‌గా పని చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి, పార్టీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ విద్యార్థి విభాగం నాయకులు నరేంద్రరెడ్డి, కుళ్లాయిరెడ్డి, హరిగౌడు, బావప్ప పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నల్లచెరువు: మండల పరిధిలోని దేవిరెడ్డి పల్లి సమీపంలో సోమవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్‌ఐ షేక్షావలి తెలిపారు. వారి నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 3 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

తాడిమర్రి: స్థానిక కుమ్మర వీధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు మామిళ్లపల్లి సంతోష్‌శర్మ స్వామి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కాపులు నాగప్ప, నారాయణస్వామి, సూర్యనరాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 489 పింఛన్ల మంజూరు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలో నూతనంగా 489 పింఛన్లు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీవారిబాబు తెలిపారు. సోమవారం 36వ వార్డు కౌన్సిలర్లు 289 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు. మిగిలిన 200 మందికి మంగళవారం పింఛన్లు అందజేస్తామన్నారు. అలాగే పట్టణంలోని 10వ వార్డులో నూతనంగా మంజూరైన పింఛన్లను వార్డు కౌన్సిలర్ కె.ఎస్ దిల్షాదున్నీషా, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కె.ఎస్ బహద్దీన్ లబ్ధిదారులకు అందజేశారు.

నాగలకట్ట నిర్మాణానికి విరాళం

తనకల్లు: మండల పరిధిలోని తిరుమలయ్య గారిపల్లిలో నిర్మించనున్న నాగలకట్ట నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి సోమవారం రూ.40 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రారెడ్డి, రెడ్డెప్ప, చంద్ర, వినోద్‌కుమార్, సమర సింహారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



రామంజినేయులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం: పట్టణానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామంజినేయులు అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పోలా రామంజినేయులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లా నాయకురాలు దిల్షాద్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దన్న, సుబ్బిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ, సీపీఐ నాయకులు నివాళులర్పించారు.

రాయితీపై ఉలవల పంపిణీ

ఎన్పీకుంట: స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో సోమవారం 80 శాతం సబ్సిడీపై రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. మండల అగ్రి అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 10 ఆర్బీకేలకు 300 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, సర్పంచ్ అంజినమ్మ ఎంపీటీసీ సభ్యుడు తిమ్మారెడ్డి, ఉపసర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, నాయకులు తిరుమలనాయుడు, శ్రీరాములు, వీహెచ్‌ఏలు యుగంధర్, అంజినాయక్ పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం–2 ఆర్బీకేలో ఎంపీపీ రమణారెడ్డి,సర్పంచ్ పంచ రత్నమ్మ చేతుల మీదుగా రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ భారతి, ఏఈఓ కవిత,వీహెచ్‌ఏలు భాస్కర్, షాజాద్ పాల్గొన్నారు.